హైస్కూల్ ప్లస్.. స్కూల్ అసిస్టెంట్లు మైనస్ !

- ప్రత్తిపాడు హైస్కూల్ ప్లస్ పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు ఉపాధ్యాయుల కొరత
- తెలుగు, ఇంగ్లిష్, గణితం పోస్టులు ఖాళీ
- అల్లాడుతున్న విద్యార్థులు



ప్రత్తిపాడు హైస్కూల్ ప్లస్ స్కూల్లో ఇంటర్మీడియెట్ తరగతులు

ప్రత్తిపాడు:విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నామని చెబుతున్న కూటమి సర్కారు మాటలకు.. వాస్తవంలో పరిస్థితులకు పొంతన కనిపించడం లేదు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం బాలికల విద్యను ప్రోత్సహించేందుకు కొన్ని హైస్కూల్స్‌ను ఎంపిక చేసి వాటిని హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసింది. అందులో ఇంటర్మీడియెట్ విద్యను ప్రవేశపెట్టింది. స్థానికంగా డిమాండ్ ఉన్న కోర్సులను బోధించేందుకు ప్రత్యేకంగా డిప్లాయిడ్ స్కూల్ అసిస్టెంట్ (స్కూల్ అసిస్టెంట్)లను కూడా సబ్జెక్టుల వారీగా నియమించింది. కానీ కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఇంటర్ విద్యార్థులకు పాఠాలు బోధించే డీఎస్ఏల కొరత వేధిస్తోంది.

మూడు పోస్టులు ఖాళీ

ప్రత్తిపాడు భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గత ప్రభుత్వంలో హైస్కూల్ ప్లస్ ఫర్ గాల్స్ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఇక్కడ ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం తరగతులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఇద్దరు ఎంపీసీ, ఎనిమిది మంది బైపీసీ విద్యార్థినులు, ద్వితీయ సంవత్సరంలో ఇద్దరు ఎంపీసీ, పన్నెండు మంది బైపీసీ విద్యార్థినులు చదువుతున్నారు. ప్రస్తుతం ఈ హైస్కూల్ ప్లస్ స్కూల్లో ఫిజిక్స్, బోటనీ, కెమిస్ట్రీ, జువాలజీకి మాత్రమే స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. ఇంగ్లిష్, తెలుగు, గణితం బోధించే పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు తీవ్ర పడుతున్నారు.

త్వరలో భర్తీ



ఇంటర్మీడియెట్‌కు సంబంధించి సబ్జెక్టుల వారీగా ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను పంపమని జిల్లా ఉన్నతాధికారులు సూచించారు. ఇప్పటికే జాబితాలను పంపాం. త్వరలోనే పోస్టుల భర్తీ జరుగుతుంది. అప్పటి వరకు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా గణితం నేనే ప్రిపేర్ అయ్యి బోధిస్తున్నాను. లాంగ్వేజెస్ కూడా హైస్కూల్ ఉపాధ్యాయులతో బోధించేలా చర్యలు తీసుకుంటా!

– షేక్ అలీషా (హెచ్ఎం, హైస్కూల్ ప్లస్ పాఠశాల, ప్రత్తిపాడు)

క్లుప్తంగా

రహదారులు, స్థితిగతులపై సర్వే



ప్రత్తిపాడు: మండలంలోని రహదారులు వాటి స్థితిగతులపై పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. మండలంలో తారు, మట్టి రోడ్ల విస్తీర్ణం, కల్వర్టుల వివరాలను నమోదు చేస్తున్నారు. ప్రత్తిపాడు–కొత్తమల్లాయపాలెం గ్రామాల మధ్య జరుగుతున్న పీఆర్ ఏఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చేస్తున్న సర్వే పనులను సోమవారం పంచాయతీరాజ్ నల్లపాడు ప్రాజెక్ట్స్ డివిజన్ డీఈ నూతలపాటి సంపత్‌కుమార్ పరిశీలించారు. ప్రత్తిపాడు మండలంలో 35 రోడ్లు ఉన్నాయని, వాటి ప్రస్తుత పరిస్థితిపై ప్రత్యేకంగా అందుబాటులోకి తీసుకువచ్చిన జీఆర్ఆర్ పీఆర్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు డీఈ చెప్పారు.

నేడు చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ

చేబ్రోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల లెవల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బందికి పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో టి. ఊహారాణి సోమవారం తెలిపారు. ఉదయం 9గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆమె పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



పొన్నూరు: సమస్యలపై ప్రజల నుంచి అందే అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి రెవెన్యూపై నాలుగు, సర్వేపై నాలుగు అర్జీలు అందాయి. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, శ్రీకాంత్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం



పెదకాకాని: స్థానిక శివాలయం అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని డెప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన పి. ఫణి రాఘవేంద్ర జ్ఞాపకార్థం పి.వి. మల్లికార్జునరావు దంపతులు రూ. 1,16,000 అందజేశారు. ఈ సందర్భంగా డెప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, నిత్యాన్న పథకానికి భక్తులు విరివిగా విరాళాలు అందజేసి స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. దాతలకు ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించి, చిత్రపటం అందజేశారు.

ముగిసిన ఏకాహం



ప్రత్తిపాడు: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెం విఘ్నేశ్వర ఆలయంలో చేస్తున్న 24 గంటల శ్రీరామ నామం ఏకాహం సోమవారం ఉదయంతో ముగిసింది. ఆదివారం ఉదయం నుంచి గ్రామానికి చెందిన మహిళలు, భక్తులు నిర్విరామంగా ఉపవాస దీక్షతో శ్రీరామ నామాన్ని జపించారు. ముగింపు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు పూర్ణాహుతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం



ధర్నాలో ఏఐటీయూసీ నేతలు, కార్మికులు

పొన్నూరు: కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు ఆరేటి రామారావు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో సోమవారం భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గుమ్మడి రోశయ్య అధ్యక్షత వహించారు. ఆరేటి రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్ల వల్ల కార్మికులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని తెలిపారు. జిల్లా కౌన్సిల్ మెంబర్ గుంటూరు ఏడుకొండలు మాట్లాడుతూ సంక్షేమ బోర్డు నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టించి కార్మికులకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మిక్కిలి జాన్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుని పునరుద్ధరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, కార్మికులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. అనంతరం ఐలాండ్ సెంటర్ నుంచి ఆర్టీసీ డిపో వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, ఏఐటీయూసీ నాయకులు శివాజీ, సూరిబాబు, కోటేశ్వరరావు, రామయ్య, పలు యూనియన్ల నాయకులు సంజీవరావు, సుబ్బారావు, రంగా పాల్గొన్నారు.

వెలవెలబోతున్న అంగన్‌వాడీలు



కొత్తమల్లాయపాలెం అంగన్‌వాడీలో ఇద్దరు చిన్నారులు



పాతమల్లాయపాలెం ఎస్సీ ఏరియా సెంటరులో ముగ్గురు



పాతమల్లాయపాలెం చెరువుకట్ట వద్ద ఉన్న సెంటరులో ముగ్గురు చిన్నారులు



తిక్కిరెడ్డిపాలెం అంగన్‌వాడీలో ఇద్దరే ఇద్దరు చిన్నారులు

బక్కచిక్కిన బాల్యాన్ని బంగారు బాల్యంగా మార్చాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలే ఇప్పుడు చిన్నారులు లేక బక్కచిక్కిపోతున్నాయి. ఏటికేడాది సంఖ్య పలుచబడటంతో కేంద్రాలు వెలవెలబోతున్నాయి. అందుకు సాక్ష్యమే సోమవారం ఆయా కేంద్రాల్లో కనిపించిన ఈ చిత్రాలు. కొత్తమల్లాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఇద్దరు, పాతమల్లాయపాలెం ఎస్సీ ఏరియా సెంటరులో ముగ్గురు, మంచినీటి చెరువు కట్ట దగ్గర సెంటరులో ముగ్గురు, తిక్కిరెడ్డిపాలెం అంగన్‌వాడీలో ఇద్దరు చిన్నారులు మాత్రమే కనిపించారు. అంగన్‌వాడీల బలోపేతంపై ప్రభుత్వం శ్రద్ధ చూపకపోవడం, కార్యకర్తలు కూడా నిర్లిప్తత ప్రదర్శిస్తుండటం, గతంలో మాదిరి అంగన్‌వాడీ బాట వంటి కార్యక్రమాలు లేకపోవడంతో చిన్నారులు సంఖ్య పడిపోతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కేంద్రాలు వెలవెలబోతున్నాయి.

– ప్రత్తిపాడు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విద్యార్థినికి నగదు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న ఎస్పీ నగేష్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏపీ ఈగిల్ వింగ్ ఎస్పీ నగేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘ ఆధ్వర్యంలో ప్రతిభ గల విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల పూర్వ విద్యార్థి నగేష్‌బాబు మాట్లాడుతూ చాక్లెట్ల రూపంలో మత్తు పదార్థాలను తయారు చేస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధి బీఎల్ శైలజ మాట్లాడుతూ పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆరో తరగతి నుంచి టెన్త్ వరకు పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.రెండు లక్షలు నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. పూర్వ విద్యార్థి చేబ్రోలు శ్రీనివాసరావు పాఠశాలకు కంప్యూటర్ అందజేశారు.విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మోహనరావు, కార్పొరేటర్ అడకా పద్మావతి, పాఠశాల హెచ్ఎం ఖాజావలి, పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు కె. కోటేశ్వరరావు, శీలం శ్రీనివాసరావు, ఆళ్ల వీరభద్రరావు, మధులాల్, హైమారావు, సీహెచ్ శ్రీను పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రత్తిపాడు: పలు కంపెనీలు సోమవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తమ కళాశాలకు చెందిన 20 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్లు ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల అధ్యక్షులు రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, కె. జగదీష్ తెలిపారు. బెంగుళూరుకు చెందిన ఎక్సెల్‌ఆర్ కంపెనీ తొమ్మిది మందిని, విధిని ఇన్నొటిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఏడుగురిని, ఎవరెస్ట్ ల్యాబ్ ఇద్దరిని, బెటర్ క్యాస్టింగ్స్ కంపెనీ ఇద్దరిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్ వివరించారు. వీరికి ఏడాదికి మూడు లక్షల నుంచి ఆరు లక్షల రూపాయల వేతనం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ కొండబోలు కృష్ణప్రసాద్, అకడమిక్ అండ్ ఆర్‌డీ డైరెక్టర్ కె. రవీంద్ర, కళాశాల డైరెక్టర్ (ఫైనాన్స్- అడ్మినిస్ట్రేషన్) ఎన్.వి.శ్రీనివాసరావు అభినందించారు.

మొక్కల సంరక్షణతో మానవాళికి రక్షణ



వనమహోత్సవ ర్యాలీలో సిస్టర్ సంధ్యారాణి, విద్యార్థినులు

పెదకాకాని: మొక్కల సంరక్షణతో మానవాళికి రక్షణ లభిస్తుందని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ సిస్టర్ సంధ్యారాణి అన్నారు. పెదకాకాని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో బుధవారం వన మహోత్సవం సందర్భంగా విద్యార్థులతో మొక్కల పంపిణీతో పాటు నాటించే కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన ర్యాలీలో 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిస్టర్ సంధ్యారాణి మొక్కలు నాటడం ద్వారా కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. మొక్కల్ని నాటడంతో పాటు పెంచి పెద్ద చేయాలని సూచించారు. మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు నిర్లక్ష్య గ్రహణం



ప్రత్తిపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించాల్సిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు నిర్లక్ష్య గ్రహణం పట్టింది. ఎంఎల్‌హెచ్‌పీలు ఎప్పుడు సెంటర్లలో ఉంటారో ఎప్పుడు ఉండరో తెలియని పరిస్థితి చోటు చేసుకుంది. సోమవారం ప్రత్తిపాడు మండలం కొత్తమల్లాయపాలెంలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ మధ్యాహ్నం 12.40 గంటలకు తలుపులు మూసివేసి దర్శనమిచ్చింది. అసలే వర్షాకాలం, వ్యాధులు ముసిరే సమయం. ఈ సమయంలో వైద్యసిబ్బంది నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ విధుల్లో అలసత్వం వహించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యమందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రైతుల సమస్యలపై దృష్టి సారించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

పెదకాకాని: రైతుల సమస్యలపై దృష్టి సారించాలని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఫిర్యాదుల దినోత్సవంలో వినతిపత్రం అందజేశారు. పంట కాలువలకు గండి రైతులు పంట నష్టపోతున్నారని తెలిపారు. పంట కాల్వల్లో తూటికాడ, గుర్రపు డెక్క తొలగింపునకు నీటి సంఘాల ప్రతినిధులు గడ్డి మందు పిచికారి చేసి నీటిని విషమయం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. పలు కాలనీల్లో వీధిలైట్లు కూడా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ఆ శాఖ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

నిర్లక్ష్యం వృక్షమై ...



శిథిలావస్థకు చేరిన గోడపై పెరిగిన చెట్టు

పొన్నూరు: పట్టణంలోని తహసీల్దారు కార్యాలయానికి వెనుక భాగాన గతంలో సబ్ జైలు ఉండేది. దాన్ని వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో అప్పటి నుంచి భవనం నిరుపయోగంగా ఉంది. శిథిలావస్థకు చేరిన గోడలపై కొన్నేళ్ల క్రితం మొలిచిన మొక్కలు ప్రస్తుతం చెట్లుగా మారాయి. అసలే పాత గోడ.. ఆపై చెట్టు వేర్లు లోపలకు వెళ్లడంతో కూలి ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని నివాసితులు కోరుతున్నారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

పొన్నూరు: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ కార్యాలయ వర్గాలు సోమవారం ప్రకటనలో తెలిపాయి. పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఉదయం 8:30 గంటలకు కాకాని మెయిన్ సెంటర్‌లోని రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద కేక్ కటింగ్ చేస్తారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పాల్గొంటారు. ఉదయం 9:30 గంటలకు చేబ్రోలు, 10:30 గంటలకు పొన్నూరు మండలంలోని మునిపల్లె, అనంతరం పొన్నూరు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం, బాపట్ల రోడ్డులోని వైఎస్సార్ విగ్రహాల వద్ద జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ మండల అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొనాలని కోరాయి.

పెదకాకాని: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఉదయం 8:30 గంటలకు సెంటర్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కొప్పురావూరు వయోవృద్ధుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పొన్నూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణలు హాజరవుతారని తెలియజేశారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని మల్లికార్జునరెడ్డి కోరారు.

పేదల పెన్నిధి డాక్టర్ వైఎస్సార్

డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి



గుంటూరు ఎడ్యుకేషన్: పేదల సంక్షేమం కోసం శ్రమించిన మహా మనిషి, పేదల పెన్నిధి డాక్టర్ వైఎస్సార్ చిరస్మరణీయుడని రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ పూర్వ అధ్యక్షురాలు డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. గుంటూరులోని అవర్ స్టేట్ అవర్ లీడర్ ఇండియన్ ఇంటలెక్చ్యువల్ ఫోరం అధ్యక్షుడు జి.శాంతమూర్తి ఆధ్వర్యంలో మహానేత డాక్టర్ వైఎస్సార్ జయంతి వారోత్సవాల్లో భాగంగా సోమవారం 'గొప్ప జ్ఞాపకాలు శీర్షికన 'పేదల పెన్నిధి వైఎస్సార్ 'అనే అంశంపై ప్రముఖ కవి కాపిరెడ్డి కృష్ణారెడ్డి మోడరేటర్‌గా వెబినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మీపార్వతి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పేద ప్రజల అభ్యున్నతికై నిరంతరం కృషి చేసిన అపర భగీరథుడు రాజశేఖర రెడ్డి అని తెలిపారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేసిన మహానేత రెండు రూపాయలకే కిలో బియ్యం పథకాన్ని పునఃప్రారంభించారని గుర్తు చేశారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ, 108 అంబులెన్స్ సేవలతో పాటు పేదలకు ఉచిత వైద్యం వంటి ఆదర్శవంతమైన కార్యక్రమాలు ప్రారంభించారని చెప్పారు. జలయజ్ఞం ద్వారా కోటి ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో భారీ నీటి ప్రాజెక్టుల నిర్మాణాలను చేపట్టారని వివరించారు. సున్నా వడ్డీ రుణాలు, ఉచిత విద్యుత్, పంటల బీమా వంటి పథకాలను చేపట్టి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల ఉన్నత చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించారని చెప్పారు. ప్రజల హృదయాల్లో కలకాలం జీవించే నాయకుడిగా గుర్తింపు పొందిన వైఎస్సార్ జయంతిని యేటా రైతు దినోత్సవంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నారని వివరించారు. వెబినార్‌లో వెంకటరెడ్డి(జర్మనీ), విష్ణు(బెంగళూరు), రత్నరాజు(రాజమండ్రి), త్రినాథ్‌రాజు(అమలాపురం), మల్లికార్జున రెడ్డి(పిడుగురాళ్ల), డాక్టర్ పుష్ప(విశాఖపట్నం), టీఆర్ రమేష్, డాక్టర్ లెనిన్, పోతురాజు దుర్గాదేవి (గుంటూరు) పాల్గొన్నారు.